జెడ్పి హైస్కూల్‌లో ఎస్ఎస్ఎ కోఆర్డినేటర్ పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని జెడ్పి గర్ల్స్ హైస్కూల్‌ను సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్‌కుమార్ శనివారం పరిశీలించారు. పాఠశాలలో ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణలో పాల్గొని పలు సూచనలు చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి రుచి చూశారు. పాఠశాలల్లో అర్ధాంతరంగా నిలిచిన భవన నిర్మాణాలపై ప్రభుత్వ ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డివైఇఒ సెవ్య, ఎంఇఒ జమలయ్య, సిఆర్‌పిలు, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం నాగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న పంకజ్‌కుమార్

కౌలుదారునికి.. రుణం ఏది..!

ప్రభుత్వాలు మారినా కౌలురైతుల పరిస్థితుల్లో మాత్రం మార్పు లేకుండాపోయింది. తాము అధికారంలోకి వస్తే కౌలురైతులను అన్నిరకాలుగా ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కాడి కింద పడేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కౌలురైతులకు మంజూరు చేసిన పంట రుణాల లెక్కలే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు.

రెండు జిల్లాల్లో లక్షా 52 వేల మందికి కౌలుకార్డులు మంజూరు

44 వేల మంది కౌలురైతులకే రుణాలు

పశ్చిమలో 24 వేల మందికి రూ.162 కోట్లు

ఏలూరు జిల్లాలో 20 వేల మందికి రూ.140 కోట్లు

అత్తెసరగానే కౌలురైతులకు రుణాల మంజూరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా కౌలురైతులు ఉన్న జిల్లాలో ఏలూరు, పశ్చిమగోదావరి మొదటిస్థానంలో ఉన్నాయి. జిల్లా వ్యవసాయ సాగులో 70 శాతానికిపైగా కౌలురైతులే సాగు చేస్తున్నారు. వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు మాత్రం బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వచ్చాక కౌలురైతులకు న్యాయం చేస్తామని చెప్పడం, అధికారంలోకి వచ్చాక పట్టించుకోకపోవడం ప్రధాన రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారిపోయింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండు జిల్లాల్లో కౌలుకార్డుల జారీ మాత్రం లక్షా 52 వేలు మాత్రమే. ఏలూరు జిల్లాలో 65 వేలు, పశ్చిమలో 87 వేల కౌలుకార్డులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కౌలుకార్డులు ఇచ్చినవారికైనా బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదు. ఈ ఏడాదికి సంబంధించి ఖరీఫ్ పూర్తయ్యి రబీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో మూడు నెలల్లో రబీ సీజన్ సైతం పూర్తికానుంది. ఇప్పటి వరకూ రెండు జిల్లాల్లో కౌలు రైతులకు అందించిన రుణాల లెక్కలు చూస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే. పశ్చిమగోదావరి జిల్లాలో 24 వేల మంది కౌలురైతులకు ఇప్పటి వరకూ రూ.162 కోట్లు రుణం, పశ్చిమలో 20 వేల మందికి రూ.140 కోట్లు రుణాలు మాత్రమే అందించినట్లు లెక్కలు చెబుతున్నాయి. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో జిల్లాకు రూ.ఎనిమిది వేల కోట్లు చొప్పున పంట రుణాలకు కేటాయించారు. 70 శాతం వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు అందించిన రుణం మాత్రం అందులో ఒక్కశాతం కూడా లేకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోంది. బ్యాంకర్ల సమావేశంలో కౌలురైతులకు రుణాలివ్వాలి అంటూ మాట్లాడటం తప్ప అందుకోసం ప్రత్యేక కార్యాచరణ అనేది లేకుండాపోయింది. దీంతో బ్యాంకర్లు కౌలురైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇచ్చినట్లు చెబుతున్న కొద్దిపాటి రుణాల్లో సైతం కౌలుకార్డుల ద్వారా అందిన రుణాలు పెద్దగా లేవనే చెప్పొచ్చు. రైతుమిత్ర గ్రూపుల ద్వారా ఇచ్చిన రుణాలనే కౌలురైతుల రుణాల జాబితాలో చూపిస్తున్న పరిస్థితి నెలకొంది.

అత్యధిక వడ్డీలతో అప్పుల సుడిగుండంలోకి..

కౌలురైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వకపోవడంతో ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి సాగు చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రతియేటా ప్రకృతి వైపరీత్యాలకు పంటలు దెబ్బతినడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు తడిసిమోపెడవుతున్నాయి. అప్పులు తీర్చలేక కౌలురైతులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం సాగుతున్నాయి. పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం అందించే సాయం సైతం కౌలురైతులకు అందడం లేదు. కౌలుకార్డు లేదనే కారణంతో పంట నష్టపరిహారం సైతం భూయజమాని జేబులోకే వెళ్లిపోతుంది. ఇ-క్రాప్‌లో భూయజమాని పేరు తప్ప కౌలురైతుల పేర్లు నమోదు చేయడం లేదు. ఒకవేళ వ్యవసాయ అధికారులు నమోదు చేసేందుకు ప్రయత్నించినా గ్రామాల్లో భూస్వాములు ఘర్షణలకు దిగుతున్నారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో అధికారులు ఏమీ చేయాలని పరిస్థితి నెలకొంది. కౌలుచట్టంలో మార్పులు చేసి రైతులకు న్యాయం చేస్తామని కూటమి ప్రభుత్వం తెగ ఊదరగొట్టింది. అదిగో చట్టం చేసేస్తున్నాం.. ఇదిగో వచ్చేస్తుందంటూ గొప్పలు చెప్పారే తప్ప చట్టం మాత్రం చేయలేదు. కౌలురైతులకు పంట నష్టపరిహారం, బీమా, పంట రుణాలు ఏఒక్కటీ అందడం లేదు. పాలకులకు తెలిసినా పట్టించుకోని పరిస్థితి. కౌలురైతులకు పంటరుణాల మంజూరులో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెంటనే రుణాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. కౌలురైతులకు రూ.రెండు వేల కోట్లు పంటరుణాలు అందించాలని మంత్రి కొలుసు పార్థసారథి గతంలో పేర్కొన్నారు. అదీ అమలుకాని పరిస్థితి ఉంది.

విద్యుత్ భారాలపై ప్రజా ఉద్యమం

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు తగలబెట్టండి

సిపిఎం జిల్లా కమిటీ సమావేశం పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా మూడు నెలల్లో రూ.16 వేల కోట్ల అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపిందని, విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నామని చెప్పకుండా దొడ్డిదారిన ట్రూఅప్ ఛార్జీల భారం వేసిందని సిపిఎం జిల్లా కమిటీ సమావేశం తీవ్రంగా విమర్శించింది. జనవరి నుంచి మళ్లీ 45 నుంచి 50 పైసలు మేర ఛార్జీలు పెంచబోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి తగలబెట్టి నిరసన తెలపాలని పిలుపునిచ్చింది. శనివారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని పలు ప్రజా సమస్యలు చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ విద్యుత్ రెగ్యులేటర్ కమిటీ నిర్ణయాలపై, ప్రజలపై భారాలు వేయడాన్ని నిరసిస్తూ ఫిబ్రవరిలో ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమం చేపడతామన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు పాపం గత ప్రభుత్వానిదని కూటమి నేతలు చెప్పడం సరికాదని, గత ప్రభుత్వ విధానాలను సమీక్షించి మార్చాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై లేదా అని ప్రశ్నించారు. విద్యుత్ భారాలతో పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీతో విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ ఆపాలని కోరారు. స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులు, మేధావులు, లౌకిక, సామాజికవాదులు, సంఘాలు నిరసన తెలపాలని కోరారు. బుట్టాయగూడెంలో అధికారులు ఎటువంటి ముందస్తు నోటీసులూ ఇవ్వకుండా నిర్మాణంలో ఉన్న సిపిఐ కార్యాలయాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై సిపిఐ ఆందోళనలకు సిపిఎం మద్దతు ప్రకటిస్తోందన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు అనుకూలంగా వచ్చిన కోర్టు తీర్పులను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టవిరుద్ధంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, తహశీల్దార్లు గిరిజనేతర భూస్వాములకు ప్రొటెక్షన్ ఆర్డర్లు ఇవ్వడం అన్యాయమని విమర్శించారు. రెవెన్యూ సమస్యల్లో పోలీసులు అతిగా జోక్యం చేసుకొని సిపిఎం నాయకులను, గిరిజనులను బెదిరించడం, అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఏజెన్సీలో గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, జి.రాజు, ఎం.నాగమణి, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

సామాన్యులపై భారాలు బాధాకరం

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - కుక్కునూరు

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై భారాలు మోపడం బాధాకరమని సిపిఎం మండల కార్యదర్శి బి.శ్రీను విమర్శించారు. పెరిగిన విద్యుత్ భారాలపై శుక్రవారం మద్రిపాడు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బి.శ్రీను మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ఛార్జీలు పెంచడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్, నిర్వాసితులు, సిపిఎం నాయకులు ముత్తయ్య, షేక్ ఖాసీం, నిర్వాసితులు సత్యవతి, హరినాథ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

వేపచెట్లు అక్రమ నరికివేత

స్థానికులు సమాచారం ఇచ్చినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తాడిపూడి కాలువ గట్టున కంసాలిగుంట సమీపంలో వేప చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికి కలప ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తాడిపూడి కాలువ గట్టుపై చెట్లను నరికి కలపను ట్రాక్టరుపై లోడు చేస్తుండగా పలువురు అడ్డుకుని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫోను ద్వారా సమాచారం ఇచ్చారు. కాని సంబంధిత అధికారులు స్పందించకుండా చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ట్రాక్టరుతో కలప లోడు మాయమైంది. పట్టపగలే యథేచ్ఛగా వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదని, దీనిపై మీకోసంలో ఫిర్యాదు చేయనున్నామని గ్రామస్తులు తెలిపారు. తాను సంఘటనా స్థలానికి వెళ్లేసరికే ట్రాక్టరు లేదని, అయితే వేప చెట్లు మొదళ్లకు నరికిన ఆనవాళ్లు ఉన్నాయని విఆర్ఒ రాంబాబు వెల్లడించారు.

కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్

31నే సామాజిక పెన్షన్ల పంపిణీ

జిల్లాలో 2,62,228 మంది ఫించన్‌దారులకు

రూ.113.01 కోట్ల పంపిణీకి ఏర్పాట్లు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జనవరి నెల పింఛను ఒకరోజు ముందుగానే ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జనవరి ఒకటో తేదీ నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు డిసెంబర్ 31వ తేదీ మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి పెన్షన్ పంపిణీ ప్రారంభమవునని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీన ఫించన్లు ఏదైనా కారణం చేత తీసుకోనివారికి రెండో తేదీన పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం జనవరి నెల పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జనవరి నెలలో 2,62,228 మంది ఫించన్‌దారులకు రూ.113.01 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ నెల 31నే వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలని, దానికి అనుగుణంగా అధికారులందరూ చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో జనవరి నెల ఫించన్లు ఒకరోజు ముందుగా ఇస్తున్న విషయాన్ని ప్రతి ఫించన్‌దారునికి వ్యక్తిగతంగా తెలియజేయాలని, ఫించన్ పంపిణీకి నిర్దేశించిన 5,298 మంది సిబ్బంది తప్పకుండా ఆరోజు ఉదయం ఆరు గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఫించన్ పంపిణీదారులకు మొదటి నాలుగు గంటల్లోపు పంపిణీ పూర్తి చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఎక్కడైనా ఏ ఒక్క పొరపాటు జరగకుండా పింఛన్ల పంపిణీ జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెలలో గత రెండు నెలల్లో వివిధ కారణాలతో ఫించన్ తీసుకొని వారికి మూడు నెలల పింఛన్ మొత్తం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నవంబర్ నెలలో జీవిత భాగస్వామి మరణించిన వారికి 212 మందికి ఈ నెలలో కొత్తగా ఫించన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు, జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.నీలాద్రి పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్

జాబ్‌మేళాలో 19 మందికి ఉద్యోగాలు

బుట్టాయగూడెం :రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 52 మంది యువత హాజరయ్యారు. వారిలో 19 మంది వివిధ కొలువులకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్రబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ స్వాతి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో లగ్జరీ ల్యాండ్ లార్డ్, శ్రీరామ్ చిట్స్‌ల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ స్వాతి, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి కె.ప్రవీణ్, కో-ఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నియంతృత్వం.. నిలువుపాతర..!

ఉమ్మడి జిల్లాలో మారిన రాజకీయ ముఖచిత్రం

సంచలన రాజకీయ పరిణామాలకు వేదికైన 2024

కూటమి విజయకేతనం..పత్తా లేని వైసిపి

ఉద్యమాల దిక్సూచిగా సిపిఎం

రాజకీయ చదరంగంలో ఎవరు ఏ ఎత్తుకు విజేతలవుతారో.. స్వయంకృతాపరాధంతో పరాజితులవుతారో అంచనా వేయడం కష్టం. ఈ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలు దీన్ని మరోసారి రుజువు చేశాయి. రాజకీయంగా ఎన్నో సంచలనాలకు, పెనుమార్పులకు 2024వ సంవత్సరం వేదికైందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. రాష్ట్రంలో అధికారం చేతులు మారడమే కాక విజేతలు సాధించిన మెజార్టీలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. సంక్షేమం ఒక్కటే సరిపోదు అభివృద్ధి అవసరమని చెబుతూనే, ఒక చేత్తో డబ్బులిచ్చి మరో చేత్తో భారాలు మోపితే ఇంటికి సాగనంపడం ఖాయమని ఈ ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయి. దీంతోపాటు పలు రాజకీయ పరిణామాలు ఈ కాలంలో తెరపైకొచ్చాయి.

టిడిపి, జనసేన కూటమి ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో విజయబావుటా ఎగరేసింది. ఎన్నికలకు మూడు నెలల ముందు వరకూ పొత్తులు, సీట్ల సర్దుబాటు సమస్యలతో సతమతమైన ఇరుపక్షాలు సమన్వయంతో ముందుకు సాగడమే కాకుండా ఓటు బ్యాంకు చీలిపోకుండా జాగ్రత్త పడటంలో కూటమి నేతలు సఫలీకృతులయ్యారనేది ఫలితాలు చెప్పకనే చెబుతున్నాయి. దెందులూరు, పోలవరం వంటి సీట్లపై చివరి వరకూ సస్పెన్స్ కొనసాగినా ముందుగా నిర్ణయించిన అభ్యర్థులనే బరిలోకి దించడం, విజేతలు కావడం అందరికీ తెలిసిందే. ఇక వైసిపి 15 సీట్లలోనూ పరాజయం కావడమేకాక, మంత్రులపైనా టిడిపి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొంది సంచలనం సృష్టించారు. జనానికి సంక్షేమ పథకాల పేరుతో డబ్బులిస్తున్నాంగా అని నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తే తరిమికొడతామని జిల్లా ప్రజలు తమ ఓటుతో చెప్పకనే చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, చెత్త పన్ను, ధరలు, ఇతర భారాలు వంటివన్నీ సాధారణ ప్రభావం చూపినా జిల్లాలో రోడ్లు అధ్వానం, ఎంఎల్ఎలు స్థానిక సమస్యలను పట్టించుకోకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో ఏ పని జరగాలన్నా ఎంఎల్ఎ అనుచరులు నిర్ణయించిన సొమ్ము చెల్లించాల్సి రావడం, ప్రజల గోడు వినే నాథుడు లేకపోవడం వెరసి ప్రజల్లో అసంతృప్తి చాపకింద నీరులా పేరుకుపోయింది. అదే సమయంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇచ్చిన హామీలు నెరవేరకపోవడం, ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఇళ్ల నిర్మాణం ప్రకటనలకే పరిమితం కావడంతోపాటు పథకాల్లో కోత కూడా జగన్ సర్కారుకు జిల్లా తీరని నష్టం కల్గించిందనే చెప్పొచ్చు.

ఏలూరు జిల్లాలో పరిశీలిస్తే ఏలూరు ఎంపీ, నూజివీడు, చింతలపూడిల్లో టిడిపి కొత్త అభ్యర్థులను బరిలోకి దింపడం, ఉంగుటూరు, పోలవరం జనసేనకు కేటాయించడంతో కొంత వ్యతిరేకత ప్రస్ఫుటంగా కన్పించింది. అయినప్పటికీ చంద్రబాబు నిరంతర జోక్యం, ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడమే కీలకమని ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఉత్తేజపర్చి ముందుకు నడిపించడం కూటమికి కలిసొచ్చిందనే చెప్పాలి. ఇదే క్రమంలో ఎంపీ అభ్యర్థి సైతం నూజివీడు, ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల్లో నెలకొన్న అసంతృప్త నేతలను బుజ్జగించి దారికి తేవడంతో కష్టంగా చెప్పిన పోలవరం నియోజకవర్గంలో సైతం జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు గెలుపు సాధ్యమైంది.

ఇక పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపీ స్థానం బిజెపికి కేటాయించినా అభ్యర్థి విషయంలో కొంత వ్యతిరేక చర్చ సాగింది. భూపతిరాజు శ్రీనివాసవర్మను బిజెపి అభ్యర్థిగా ప్రకటించినా కొంతమంది కూటమి ఎంఎల్ఎ అభ్యర్థులు దాన్ని వ్యతిరేకించడం, అప్పటి సిట్టింగ్ ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఎలాగైనా ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నించడంతో కొంత సందిగ్ధత ఏర్పడింది. చివరి నిమిషంలో ఉండి ఎంఎల్ఎ అభ్యర్థి మంతెన రామరాజును పక్కనపెట్టి రఘురామకృష్ణంరాజును ఎంఎల్ఎ అభ్యర్థిగా బరిలోకి దింపడంతో కూటమి ఈ జిల్లాలోనూ పరిస్థితిని చక్కబర్చుకుంది. అయితే ఉండి నియోజకవర్గంలో బలమైన అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ ఎంఎల్ఎ శివ

తొలుత హడావుడీ చేసినా ఓట్ల సాధనలో మాత్రం విఫలమయ్యారు.

రెండు జిల్లాల్లోనూ వైసిపి తరపున జగన్ మినహా ఇతరులెవరూ పైనుంచి ప్రచారానికి రాకపోవడం, అప్పటికే ఆయా నియోజకవర్గాల్లో చాపకింద నీరులా ఉన్న ఆధిపత్యపోరు, అసంతృప్తవాదులను బుజ్జగించే నాథుడే కరువవ్వడంతో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు తయారైంది. దీనికితోడు ప్రచారంలో సంక్షేమ పథకాల గురించి తప్ప స్థానిక అంశాలు, సమస్యలపై నోరు మెదపలేకపోవడంతో జనంలో అసంతృప్తిని మరింత పెంచింది. ఒకదశలో వైసిపి అభ్యర్థులే అంతర్మథనంలో పడి ప్రచారాన్ని సైతం ముందుగానే ముగించి మంతనాలకే పరిమితమయ్యారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలవరం నియోజకవర్గం మినహా అన్నింటా తిరుగులేని ఆధిక్యతతో కూటమి అభ్యర్థులు విజయబావుటా ఎగురవేయడం ప్రజావ్యతిరేకతకు నిదర్శనం.

ఇదే సమయంలో ఇండియా వేదిక సైతం జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీ చేసింది. జిల్లా కేంద్రమైన ఏలూరు మినహా మిగిలిన అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే బరిలోకి దిగారు. అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలను, వాటికి ప్రత్యామ్నాయం తాము తీసుకొచ్చే విధానాలను ప్రచారంలో జనం దృష్టికి తీసుకెళ్లేందుకు ఇండియా వేదిక అభ్యర్థులు గట్టి ప్రయత్నం చేశారు.

సత్తా చాటిన పిడిఎఫ్.. ★★★

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికలు ఇటీవల జరిగాయి. గత సంవత్సరం 15న ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. పిడిఎఫ్ తరపున యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి బరిలోకి దిగగా ప్రత్యర్థిగా గంధం నారాయణరావు బరిలోకి దిగారు. గతంలో షేక్ సాబ్జీ వలె గోపీమూర్తి సైతం తొలి ప్రాధాన్యతా ఓట్లతోనే విజయదుందుభి మోగించి పిడిఎఫ్ సత్తా చాటారు.

పోరుబాటలో ఉద్యమాల రథసారధి సిపిఎం. ★★★

ఈ కాలంలో జిల్లాలో సీట్లు, ఓట్లుతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యలపై పోరాటాలే ఊపిరిగా ఉద్యమాల రథసారధి సిపిఎం జిల్లాలో ముందుకు సాగింది. ఇండియా వేదికలో సర్దుబాట్లు రీత్యా రెండు జిల్లాల్లో సాధారణ ఎన్నికల్లో పోటీలో లేకపోయినా ఇండియా వేదిక అభ్యర్థుల తరపున ప్రచారంలో తనదైన శైలిలో ముందుంది. ఇక ఏజెన్సీలో భూపోరాటాలు, ఎర్రకాల్వ మిగులు భూముల పోరాటం, దెందులూరు మండలం దోసపాడు తదితర ప్రాంతాల్లో అసైన్డ్ భూముల పోరాటం, పరిశ్రమల్లో ప్రమాదాల సందర్భంగా కార్మికుల తరపున నిలబడి పరిహారం కోసం పోరు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగుల సమస్యలపై సాగే పోరాటాలకు నిరంతరం అండగా ఉండడమే కాకుండా ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొని ఉద్యమాల దిక్సూచిగా నిలిచింది.

పదవుల జోరు.. నేతల్లో హుషారు.. ★★★

సాధారణ ఎన్నికల అనంతరం నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కగా, పశ్చిమ నుంచి పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా నుంచి నూజివీడు ఎంఎల్ఎ కొలుసు పార్థసారధి మంత్రి పదవులు చేపట్టారు. ఇక నామినేటెడ్ పదవుల విషయానికొస్తే బొరగం శ్రీనివాస్ ఎపి ట్రైకార్ ఛైర్మన్‌గా, రెడ్డి అప్పలనాయుడు ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ రీజనల్ బోర్డు ఛైర్మన్‌గా, పీతల సుజాత ఎపి వినియోగదారుల ప్రొటెక్షన్ సెల్ ఛైర్మన్‌గా, మంతెన రామరాజు ఎపిఐఐసి ఛైర్మన్‌గా, వేగేశ్న కనకరాజు సూరి క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, కొత్తపల్లి సుబ్బారాయుడు కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా పదవులు దక్కించుకున్నారు. మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా క్యాబినెట్ ర్యాంకుతో మహ్మద్ షరీఫ్ పదవి దక్కించుకోగా ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నిక కావడంతోపాటు క్యాబినెట్ హోదా దక్కించుకున్నారు. ఇక విప్‌లుగా బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీను పదవులు దక్కించుకోగా, ఎపి పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్‌గా భీమవరం ఎంఎల్ఎ పి.అంజిబాబు ఎన్నికయ్యారు.

మొత్తంగా 2024 జిల్లా రాజకీయ ముఖచిత్రంలో పెనుమార్పులకు వేదికైందనడంలో ఎటువంటి సందేహమూ లేదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

- డెస్క్

గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే శాస్త్రీయబద్ధంగా ఉండాలి

కొల్లేరు సర్వేకు ప్రతిపాదనలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

కొల్లేరు సరస్సుకు సంబంధించి 2022-23లో నిర్వహించిన లిడార్ సర్వే పూర్తయిన అనంతరం గ్రౌండ్ ట్రూతింగ్ కోసం అటవీ శాఖాధికారులు ప్రతిపాదించిన అంశాలపై శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సమీక్షలో భాగంగా కొల్లేరు సరస్సు లిడార్ ల్యాండ్ సర్వే నిర్వహించిన ఏజెన్సీ ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు, అటవీ శాఖాధికారులు, ఇరిగేషన్, తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే చేపట్టేందుకు ఉన్న అవసరత, సాంకేతిక సామర్థ్యాలు తదితర అంశాలు శాస్త్రీయ బద్ధంగా ఉండేలాగా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సమావేశం అనంతరం గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించి తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ అధికారి ఆశాకిరణ్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.విజయ, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరిష్, డ్రెయినేజీ ఇఇ సిహెచ్.సత్యనారాయణ, సర్వే ఎడి అన్సారి, డివిజనల్ సర్వే అధికారి, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి సబ్‌జైలు పరిశీలన

చింతలపూడి :చింతలపూడి సబ్‌జైలును మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి సిహెచ్.మధుబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిందితులను కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాల గురించి నిందితులను అడిగి తెలుసుకున్నారు. నిందితులకు అందించిన సహాయంపై ఆరా తీశారు. జైలు సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. వంటశాల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారా గార పర్యవేక్షణాధికారి కృపానందం, జైలు సిబ్బంది, న్యాయవాది ఏసుపాదం, పిఎల్‌వి.అక్బర్‌అలీ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు పాతబస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న రెడ్డిఅప్పలనాయుడు

ఏలూరు పాత బస్టాండ్‌ను ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోనల్ ఛైర్మన్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన బస్టాండ్ ఆవర ణలో ఉన్న వివిధ స్టాళ్లను, సైకిల్ స్టాండ్‌లను పరిశీలించారు. వ్యాపారులందరూ ఏదైనా ఎంఆర్‌పి ప్రకారమే విక్రయించాలని చెప్పారు. ప్రయాణికుల వద్ద అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలుంటాయని చెప్పారు. ప్రయాణికులకు అందిస్తున్న సేవల గురించి డిపో మేనేజర్ వాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు ఎల్లప్పుడూ తాగునీరు అందుబాటులో ఉండాలని, బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లు మరింత పరిశుభ్రంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జోనల్ ఛైర్మన్‌తో పాటు ఏలూరు డిపో మేనేజర్ వాణి, అసిస్టెంట్ మేనేజర్ మురళి, వివిధ హోదాల్లో ఉన్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల్లో ప్రతిఒక్కరికీ సురక్షిత తాగునీటిని అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా నల్లమాడు, గోపీనాథపట్నం, నాచుగుంట గ్రామాల్లో రూ.116.38 కోట్లతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులను ఎంఎల్‌ఎ శనివారం ప్రారంభించారు. ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేలా పైపు మార్గం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ధర్మరాజు ఆదేశించారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

పేద గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు తక్షణమే ప్రభుత్వం పట్టాలివ్వాలని కుక్కునూరు మండల గిరిజన సంఘం నాయకులు వర్సా పాపారావు కోరారు. పోడు భూములకు పట్టాలివ్వాలని కోరుతూ మండలంలోని బెస్తగూడెంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించినవారిలో వర్సా నాగేశ్వరరావు, పొట్ల లక్ష్మయ్య, చిన లక్ష్మయ్య, అర్జున్ ఉన్నారు.

రాజనీతిజ్ఞుడు మన్మోహన్‌సింగ్

ప్రజాశక్తి - దెందులూరు

భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి పదవికి వన్నె తెచ్చారని, ఎన్నో ఆర్థిక సంస్కరణలకు పునాది వేశారని జిల్లా పరిషత్ హైస్కూల్ రేమల్లె ప్రధానోపాధ్యాయులు ఎన్.లోదర్‌పాల్ అన్నారు. మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పాఠశాలలో శనివారం నివాళులర్పించారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ దేశం నిజాయితీ, నిబద్ధత గల నాయకుడిని కోల్పోయిందని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు డి.వెంకటేశ్వరరావు విద్యార్థుల చేత మౌనం పాటింపచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.సువర్చలాదేవి, కెవి.కుమారి, టి.శ్రీలక్ష్మి, డి.పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఫిజికల్ గ్రౌండ్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గత సంవత్సరంన్నర కాలంగా కానిస్టేబుల్ అభ్యర్థులు ఎదురుచూస్తున్న ఫిజికల్ గ్రౌండ్ పరీక్షలకు నోటిఫికేషన్ విడుదలైంది. 2022లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్‌కు ప్రిలిమ్స్ పరీక్ష పూర్తయింది. అనంతరం అనివార్య కారణాలవల్ల ఫిజికల్ గ్రౌండ్ పరీక్షలు వాయిదా పడ్డాయి. సంవత్సరంన్నర కాలం తర్వాత ఫిజికల్ పరీక్షలు పెట్టడానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో కానిస్టేబుల్ అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాకు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు ఫిజికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే హాల్ టిక్కెట్లను అందుబాటులో ఉంచింది. పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు 4976 మంది ఉండగా అందులో పురుషులు 3997, స్త్రీలు 979 ఉన్నారు.

సభకు హాజరు కాని అధికారులకు మెమోలు

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి- ముదినేపల్లి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులందరికీ మెమోలు ఇస్తామని, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ తహశీల్దార్ సుభాని బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇప్పటివరకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు హాజరు కాకపోవడం విచారకరమన్నారు. ఇకపై జరిగే సమావేశాలకు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సభకు రాకపోవడంతో సమస్యలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు ఉండడంలేదన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు మాట్లాడారు. ఎంపిపి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

బ్యాంకు ఉద్యోగి ఇంట్లో పట్టపగలు చోరీ

బంగారం, నగదు అపహరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కైకరంలో బ్యాంకు ఉద్యోగి ఇంట్లో శనివారం పట్ట పగలు చోరీ జరిగింది. మన్నె సతీష్‌కుమార్ కైకరంలో పంచాయతీ కార్యాలయం సమీపంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ నారాయణపురం ఎస్‌బిఐలో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం సెలవు రోజు కావడంతో భార్యతో కలిసి ఉదయం 11 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం వెళ్లిన సతీష్‌కుమార్ దంపతులు తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. లోపలకి వెళ్లే సరికి బీరువా పగలకొట్టి అందులో సామగ్రి, బట్టలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏలూరు నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

34 మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

34 మద్యం సీసాలనుస్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దర్భగూడెం గ్రామ పరిసర ప్రాంతాల్లో శనివారం ఎస్ఐ పి.నవీన కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. తపస్వివారిగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా అతడిని పట్టుకొని తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న సంచిలో 34 మద్యం సీసాలను గుర్తించినట్లు తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

చింతలపూడి: నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు. నవోదయం 2.0. కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారా స్థావరాలపై శనివారం దాడి చేశారు. ఈ దాడిలో నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వడిత కృష్ణ అనే వ్యక్తిని, వడిత రాధ, దారవత్ అరుణా సబావత్ పద్మ అనే మహిళల నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీకి పనికి వచ్చే ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన సుమారు 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అదేవిధంగా గ్రామ శివారు అటవీ ప్రాంతం ప్రదేశంలో 1400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఇస్లావతు మానస అనే మహిళకు సంబంధించిన బెల్లపు ఊట లభ్యమైన విషయంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గడబిడ.. గగుర్పాటు..!

ఇటీవల చర్చనీయాంశమైన వినూత్న, అనూహ్య ఘటనలు జిల్లావాసులను గడబిడతోపాటు గగుర్పాటుకు గురిచేశాయి. జెడ్‌పి ప్రత్యేక సమావేశం, సాధారణ సమావేశం మంత్రులు, ఎంఎల్‌ఎల హాజరు లేక చప్పగా సాగగా వైసిపి జెడ్‌పిటిసిల తీరు చర్చనీయాంశమైంది. ఇక డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో వెలుగు చూసిన అంశాలు అందరినీ గగుర్పాటుకు గురి చేశాయి. ఓ పక్క మతం, కులం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతూ మనుషులను విడదీస్తున్న ప్రస్తుత కాలంలో ఆస్తుల కోసం ఇటువంటి అఘాయిత్యాలకు కారణం పాలకుల విధానాల ఫలితమేననే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక టిడిపి గూటికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ చేరిన సంగతి అందరికీ తెలిసిందే. నాటి నుంచి ఆమెను ఎలాగైనా పదవి నుంచి తప్పించాలని వైసిపి జెడ్‌పిటిసిలు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో అధికారులు సైతం వివిధ కారణాలతో ఆ సమావేశ నిర్వహణను వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఎట్టకేలకు ఇటీవల జెడ్‌పి ప్రత్యేక సమావేశం నిర్వహించగా వైసిపి జెడ్‌పిటిసిలు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడం ఒకటైతే, పద్మశ్రీని ఛైర్‌పర్సన్‌గా తప్పించాలనే మాట్లాడారు తప్ప దానికి కారణాలపై స్పష్టంగా చర్చించలేకపోయారనే విమర్శలు విన్పిస్తున్నాయి. చివరకు అధికారులు స్థానిక సంస్థల నిబంధనల ప్రకారం నాలుగేళ్ల వరకూ అభిశంసన తీర్మానం పెట్టడానికి సాధ్యం కాదని తేల్చిచెప్పడంతో సమావేశం ముగిసింది. తర్వాత జరిగిన సాధారణ సమావేశానికి వైసిపి సభ్యులు తొలుత ముఖం చాటేయడం, తర్వాత కొంతమంది హాజరైనా సమస్యలపై చర్చించకపోవడం గమనార్హం. మొత్తానికి జెడ్‌పి ప్రత్యేక, సాధారణ సమావేశాలు గడబిడకు వేదికయ్యాయి తప్ప సమస్యల చర్చకు నోచుకోలేదని జనం పెదవి విరుస్తున్నారు.

డెడ్‌బాడీ డోర్ డెలివరీ కేసులో ప్రధాన నిందితుడు తిరుమాని శ్రీధర్‌వర్మ నేరచరిత్ర అందరినీ విస్మయపరుస్తోంది. ఇద్దరు మహిళలను ప్రేమ పేరుతో పెళ్లి చేసుకోవడమే కాక మరో వివాహితతో సహజీవనం చేయడం బట్టి అతడు ఎంత మోసగాడో స్పష్టమవుతోంది. అదే సమయంలో రెండో భార్య రేవతి తల్లిదండ్రుల, ఆమె అక్క ఆస్తిని కాజేయాలని పన్నాగం పన్నడం, దానికి రేవతిని సైతం కుట్రలో భాగస్వామిగా చేయడం దిగజారుతున్న మానవ విలువలు, కుటుంబ సంబంధాలకు నిలువుటద్దంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అదే సమయంలో అమాయకుడైన బర్రె పర్లయ్యను పని ఇప్పిస్తానని తీసుకెళ్లి కిరాతకంగా హత్య చేయడంపై అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఈ వ్యవహారంలో ఆర్థిక అంశంతోపాటు విలాసాలకు ఎంతకైనా తెగిస్తున్నారనేది స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన కారణం పాలకుల విధానాల ఫలితంగా పెరిగిన ఉరుకులు పరుగుల జీవితాలతో కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం కావడమేనని పలువురు అంటున్నారు. కులం, మతం పేరిట విద్వేషాలు ఆపి, ఆ ఆలోచనలు జనాల్లోకి ఎక్కించే ప్రయత్నాలు ఆపి, చిన్ననాటి నుంచి మానవత, నైతిక విలువలు పెంపొందించే అంశాలు, విధానాలు తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పలు రకాలైన భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ కోరారు. ఆగిరిపల్లిలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో పలు సమస్యలకు సంబంధించి 16 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ తెలిపారు.

నిడమర్రు : మండలంలోని నిడమర్రు గ్రామ సచివాలయంలో తహశీల్దార్, రెవెన్యూ శాఖ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యలతో వచ్చిన వారి సమస్యలను వినతుల రూపంలో స్వీకరించిన ఎంఎల్‌ఎ వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మండవల్లి : భూ సంబంధిత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కె.గోపాల్ తెలిపారు. మండలంలోని కానుకొల్లులో శనివారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని 32 గ్రామాల్లో ఇప్పటివరకు 19 గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలను విజయవంతంగా నిర్వహించామన్నారు.

కలిదిండిలో..

సభలో భూ సంబంధిత సమస్యలు ఉన్న రైతులు పాల్గొని అర్జీలను సమర్పించినట్లు చెప్పారు.

కలిదిండి : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించే ఉద్దేశంతో విస్తీర్ణంలో తేడాలు, పేర్లు, ఆధార్ నెంబర్, ఫొటో మార్పులతో పాటు పాసు పుస్తకాలు, సెపరేట్ ఎల్‌పిఎం చేసుకునేందుకు అవకాశం కల్పించినందున రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణ, సర్వేయర్ మహ్మద్ షమీ, ఆర్ఐ శ్యామల, విఆర్ఓ డేవిడ్‌రాజు, నాయకులు నాగిడి వీరబ్రహ్మం, అంద్రాజు దుర్గారావు, బళ్ల రాజు, కోకా ఉమామహేశ్వరరావు, తిరుమాని గోపాలకృష్ణ, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, రైతులు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని గోపవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 12 మంది రైతులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందించినట్లు తహశీల్దార్ జి.పురుషోత్తమశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు ఎన్.మస్తాన్‌రావు, ఎస్.శ్రీనివాసరావు, పి.నవీన్, హనీబాబు, హరిబాబు, ఎం.విజయకుమారి, టి.యశోద, సిహెచ్.రవికాంత్, మణేంద్ర పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

చినమల్లం గ్రామ కాపరుస్తులు పెనుగొండ మండలం కుడిపూడి గోపాలకృష్ణమూర్తి తండ్రి సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. చిన్నమల్లం నుండి పెనుగొండ వస్తుండగా దారిలో పడిపోయింది. నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ : S9272820 గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

కుడిపూడి గోపాలకృష్ణమూర్తి,
తండ్రి : సత్యనారాయణ, డోర్ నెంబర్ :1-45,
కట్టాలమ్మ చెరువు, చినమల్లం
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా
సెల్ : 9676465682

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. ఎంపిపి కోర్స పోసమ్మ అధ్యక్షతన వహించిన సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిలు, కోరం సభ్యులు హాజరు కాలేదు. కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరు కావడంతో ఖాళీ కుర్చీలతో సమావేశాన్ని తూతూ మంత్రంగా కానిచ్చేశారు.

సమావేశానికి వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు డుమ్మా

మండల సర్వసభ్య సమావేశానికి వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు డుమ్మా కొట్టారు. గత ప్రభుత్వ హయంలో ఎంపిపి పదవి మొదటి మూడు సంవత్సరాలు ఒకరికి తర్వాత రెండు సంవత్సరాలు ఒకరికి అంటూ తీర్మానం రాసుకోగా కోర్స పోసమ్మ పదవి కాలం పూర్తయినా పదవి నుంచి దిగట్లేదని వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు సమావేశానికి హాజరు కాలేదని పలువురు ఎంపిటిసిలు విమర్శిస్తున్నారు.

సిఆర్ రెడ్డిలో 'శత వసంతాల అక్కినేనికి స్వరాంజలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్.రెడ్డి కళాశాల సాంస్కృతిక విభాగం, ఐక్యూఎసి, ఘంటసాల స్వరపీఠం సంయుక్త ఆధ్వర్యంలో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా శనివారం శత వసంతాల అక్కినేనికి స్వరాంజలి కార్యక్రమం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అటానమస్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కెఎస్.విష్ణుమోహన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం కళాశాలలో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. నేటి విద్యార్థులకు సంగీతం, సాహిత్యాల గురించి తెలియజేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఎ.రామరాజు మాట్లాడుతూ ఘంటసాల, అక్కినేని నాగేశ్వరరావు జీవిత విశేషాలను వివరించారు. డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నటించిన చలన చిత్రాల్లోని పాటలను, ఘంటసాల వెంకటేశ్వరరావు ఆలపించిన పాఠాలను ఎస్ఎం.సుభాని, శ్రీవల్లీ సరస్వతి, ఆశ ఈటి అర్జునరావు ఆలపించారు.

కౌన్సిల్ సాక్షిగా విగ్రహ రాజకీయాలు!

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మున్సిపల్ కౌన్సిల్ సాక్షిగా విగ్రహ రాజకీయాలు ప్రారంభమయ్యాయి. నూజివీడు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన శనివారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గౌతు లచ్చన్న విగ్రహ ఏర్పాటుకు ఎవరు అనుమతించారని ప్రశ్నించారు. ఎలాంటి అనుమతులు లేనప్పుడు ఎలా ఉపేక్షిస్తారని, విగ్రహ ఏర్పాటుపై, నిర్వాహకులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని అధికారులను నిలదీశారు. టిడిపి ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు అమల్లోకి రాకముందే 15 ఏళ్ల క్రితం నుంచి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరినప్పటికీ అధికారుల్లో స్పందన లేదని వాపోయారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ జోక్యం చేసుకొని ఎవరు ఎలాంటి విగ్రహాలు ఏర్పాటు చేసినా అందులో రాజకీయ ప్రమేయం ఉండదని స్పష్టం చేశారు. అటు ఎన్‌టిఆర్, ఇటు డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహాలతో పాటుగా నూజివీడు ప్రాంత విద్యాప్రదాత డాక్టర్ ఎంఆర్.అప్పారావు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. మరో కౌన్సిలర్ నౌడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నూజివీడుతో పాటు విజయవాడ నగరానికి సైతం విద్యను అందించిన ఖ్యాతి నూజివీడు రాజా డాక్టర్ ఎంఆర్.అప్పారావుకే దక్కుతుందన్నారు. అలాంటి విద్యాప్రదాత విగ్రహం నేటివరకూ ఏర్పాటు చేయలేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా విద్యాప్రదాత డాక్టర్ ఎంఆర్.అప్పారావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయాలని కోరారు. ట్రిపుల్ ఐటీతో మున్సిపాలిటీ ఎంఒయు ఒప్పందం కుదుర్చుకోవడం వెనుక అసలు కథ ఏమిటన్నారు. కౌన్సిల్ సభ్యులకు తెలియకుండా ఎలా ఒప్పందాన్ని కుదుర్చుకుంటారన్నారు. మున్సిపాలిటీలో ఉన్న కౌన్సిల్ సభ్యుల రేషియో ప్రకారం టెండరింగ్, పనుల నిర్వహణ కొనసాగాలని పగడాల డిమాండ్ చేశారు. వైసిపికి చెందిన తమ సభ్యులు 27 మంది ఉండగా, మిగిలిన ప్రతిపక్ష సభ్యులకు వారి రేషియో ప్రకారం పనులను కేటాయించాలన్నారు. తమకు నాలుగు పనులు చేసే అవకాశం ఉంటే, వారికి ఒక పనిగా నిర్వహించటం ద్వారా అన్ని వార్డులు, అందరూ కౌన్సిలర్లకు పనులు జరుగుతాయన్నారు. దీంతో సమస్యలు పరిష్కరమై పట్టణాభివృద్ధి త్వరితగతిన కొనసాగుతుందన్నారు. ఈ విధానం అమలు చేయనందున వివిధ రకాల పనుల నిమిత్తం పిలిచిన పది టెండర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసి, తీర్మానించడంతో పనులకు సంబంధించిన టెండర్లు నిలిచిపోయాయి.

మిర్చి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వలసపల్లి, ఎల్లాపురం, గుడిపాడు ప్రాంతాల్లో మిర్చి పంట వేసిన రైతులు నల్లి పురుగు వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని రైతుసంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు సిహెచ్.శ్రీనివాస్ శనివారం మిర్చి పంట పొలాలను పరిశీలించారు. మిర్చి పంటకు నల్లి పురుగు వాటిల్లి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ ఉద్యానవన శాఖాధికారులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మిర్చి పంటలో నల్లి పురుగు, తామర పురుగు సమస్యను రాష్ట్ర విపత్తుగా గుర్తించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'టిడిపి కూటమితోనే పల్లెలు అభివృద్ధి'

ప్రజాశక్తి - మండవల్లి

పల్లెలు అభివృద్ధి చెందేది కూటమి ప్రభుత్వంతోనేనని కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లింగాల గ్రామంలో కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు సిఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ఎన్‌టిఆర్ కన్న కనులు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు సారధ్యంలోనే ప్రతి పల్లె అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు.అనంతరం బస్టాండ్‌ను, ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు.

మహారాజశ్రీ 7వ అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు, విజయవాడ.

I.A. No. 1333/2019 in O.S. No. 198/2017

బిట్వీన్
కలసాని చుక్కమ్మ .... పిటీషనరు / ప్లెయింటిఫ్
అండ్
సంపతి కనకమ్మ (డైడ్) మరియు ఇతరులు
.... రెస్పాండెంట్లు / డిఫెండెంట్స్

R5: సంపతి నాగ రజని కుమారి, భర్త : (లేటు) శ్రీనివాసరావు, హిందూ, వయస్సు 40 సం॥లు
R6: సంపతి వంశీకృష్ణ, తండ్రి : లేటు శ్రీనివాసరావు, హిందూ, వయస్సు 20 సం॥లు,
R7: సంపతి నరేంద్రరావు, తండ్రి : లేటు శ్రీనివాసరావు, హిందూ, వయస్సు 19 సం॥లు.
చిరునామా : R5 to R7 (Same address), R/o D.No. 25-22/1, వీరభద్రరావు, గ్రూప్ హౌస్, ఫస్ట్‌ఫ్లోర్, చైతన్య స్కూల్ దగ్గర, నూజివీడు - 521201

పై దావాలో R5, R6, R7 రెస్పాండెంట్లు/ డిఫెండెంట్లు అయిన మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేసినందున సదరు శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది. 06-01-2025 ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ఎదుట హాజరై అభ్యంతరాలు వున్న యెడల స్వయంగా గానీ, లేదా మీ ప్లీడరుగారి ద్వారా గానీ తెలియేయగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 06-01-2025

జె.వరుణ్‌రాయ్,
డి.ఆదినారాయణరెడ్డి,
న్యాయవాదులు,
విజయవాడ-2.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 289/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
బొర్రా వెంకటేశ్వరరావు అండ్ అనదర్ ***ప్రతివాది -ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: బొర్రా వెంకటేశ్వరరావు, S/o. సత్యనారాయణ, డోర్ నెం. 2-30, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: వేముల రాము, S/o. మోహనరావు, డోర్ నెం. 4-120, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 02--01-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 221/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
పితాని సత్యనారాయణ అండ్ అనదర్ ***ప్రతివాది -ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: పితాని సత్యనారాయణ, S/o. గాంధీ, డోర్ నెం. 21-4-15, 19వ బ్లాకు, బంగారువారి చెరువుగట్టు, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

D-2: వేముల రాజేశ్వరరావు, S/o. వెంకటరత్నం, డోర్ నెం. 4-85, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 02-01-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 143/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
ఆరేపల్లి లక్ష్మీతులసి అండ్ అనదర్ ***ప్రతివాది -ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: ఆరేపల్లి లక్ష్మీతులసి, W/o. నారాయణరావు, డోర్ నెం. 4-102, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 02-01-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ 7వ అదనపు డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు, విజయవాడ.

I.A. No. 1332/2019 in O.S. No. 198/2017

బిట్వీన్
కలసాని చుక్కమ్మ .... పిటీషనరు / ప్లెయింటిఫ్
అండ్
సంపతి కనకమ్మ (డైడ్) మరియు ఇతరులు
.... రెస్పాండెంట్లు / డిఫెండెంట్స్

R5: సంపతి నాగ రజని కుమారి, భర్త : (లేటు) శ్రీనివాసరావు, హిందూ, వయస్సు 40 సం॥లు
R6: సంపతి వంశీకృష్ణ, తండ్రి : లేటు శ్రీనివాసరావు, హిందూ, వయస్సు 20 సం॥లు,
R7: సంపతి నరేంద్రరావు, తండ్రి : లేటు శ్రీనివాసరావు, హిందూ, వయస్సు 19 సం॥లు.
చిరునామా : R5 to R7 (Same address), R/o D.No. 25-22/1, వీరభద్రరావు, గ్రూప్ హౌస్, ఫస్ట్‌ఫ్లోర్, చైతన్య స్కూల్ దగ్గర, నూజివీడు - 521201

పై దావాలో R5, R6, R7 రెస్పాండెంట్లు/ డిఫెండెంట్లు అయిన మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేసినందున సదరు శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది. 06-01-2025 ఉదయం 10-30 గం.లకు కోర్టువారి ఎదుట హాజరై అభ్యంతరాలు వున్న యెడల స్వయంగా గానీ, లేదా మీ ప్లీడరుగారి ద్వారా గానీ తెలియేయగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా : 06-01-2025

జె.వరుణ్‌రాయ్,
డి.ఆదినారాయణరెడ్డి,
న్యాయవాదులు,
విజయవాడ-2.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 295/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
కట్టా ప్రియాంక అండ్ అనదర్ ***ప్రతివాది -ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: కట్టా ప్రియాంక, W/o. వెంకటేశ్వరరావు, డోర్ నెం. 4-3/C, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: పజ్జూరి రమేష్, S/o. మల్లేశ్వరరావు, డోర్ నెం. 19-5-11, 19వ బ్లాకు, బంగారువారి చెరువుగట్టు, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 02-01-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 349/2022

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
ఆరేపల్లి రాధామాధవి అండ్ అనదర్ ***ప్రతివాది -ప్రతివాదులు***

సమన్స్ టు:

D-1: ఆరేపల్లి రాధామాధవి, W/o. సత్యనారాయణ, డోర్ నెం. 3-108, 4వ బ్లాకు, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

D-2: తొంటా జ్యోతిలక్ష్మి, W/o. శ్రీనివాసరావు, డోర్ నెం. 25-11-14/1, రామయ్యహాలు వీధి, 14వ బ్లాకు, పాలకొల్లు, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించినను అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 07-01-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 23-12-2024 సెల్: 98662 59514